క్లుప్తంగా

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆర్యవైశ్య సంఘం రాష్ట్రనేత జగదీశ్వర్ గుప్తా



సిద్దిపేట: నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు సరికొత్త ఆశయాలతో ముందుకు సాగాలని, అందరికీ శుభం కలగాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్రనేత జగదీశ్వర్ గుప్తా ఆకాంక్షించారు. మంగళవారం ఆయన ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పంటలు సమృద్ధిగా పండి రెండు తెలుగు రాష్ట్రాల రైతులు సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుంచు కృష్ణయ్య(55)కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పని ముగించుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో ఔటర్‌రింగ్‌రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టి గాయాల పాలయ్యాడు. అతడిని ములుగు మండలంలోని లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. అతడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వేతనాలు లేక కూలీల వెతలు

గజ్వేల్: ఉపాధి హామీ కూలీలకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని జాలిగామ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు కూలీలకు వేతనాలు అందేలా చూడాలని, రోజువారీ రూ.300 వేతనం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో భద్రత కరువు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భద్రత కరువైందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, సీనియర్ నాయకుడు భూపేశ్ విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల మీద ప్రతీకార భావంతో పని చేస్తోందన్నారు. నాయకులు మోహిజ్, శ్రీకాంత్, సయ్యద్, బాబ్ జానీ, రమేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం

దుబ్బాకటౌన్: సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని దేశ్ పాండే ఫౌండేషన్ కో ఆర్డినేటర్ దాతర పల్లి భాస్కర్ సూచించారు. రాయపోల్‌లో మంగళవారం రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వల్ల భూసారం తగ్గడమే కాకుండా దిగుబడులు తగ్గిపోతాయన్నారు. కార్యక్రమంలో పీయూ మేనేజర్‌లు, ఎఫ్ఎఫ్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన ఎస్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి రామంచ రవీందర్ తండ్రి దుర్గయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రూపేష్, మధు, జనార్దన్ పాల్గొన్నారు.

మేర సంఘం నూతన కమిటీ ఎన్నిక

మిరుదొడ్డి(దుబ్బాక): నియోజకవర్గ మేర సంఘం నూతన కమిటీని మంగళవారం మిరుదొడ్డిలో ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, గౌతం, కార్యదర్శిగా జ్ఞానేశ్వర్, కోశాధికారిగా శ్రీనివాస్, సలహాదారులుగా లింగం, వెంకటేశ్, తిరుపతి, చిత్తారి, రమేశ్, వినయ్, శ్రీనివాస్, సంతోష్, శరత్ తదితరులను నియామకం చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ ఉపాధి లేక ఆర్థికంగా ఎనకబడిన మేర కులస్తులు అన్నిరంగాల్లో రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కుట్టు మిషన్లు అందజేయాలని, విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే టెండర్లను తమకు అప్పగించాలని కోరారు.

కులనిర్మూలనకు కృషి చేయాలి

హుస్నాబాద్‌రూరల్: పల్లెల్లో అందరూ కులనిర్మూలనకు కృషి చేయాలని ఏఎస్ఐ మల్లేశం సూచించారు. మీర్జాపూర్‌లో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పౌరహక్కుల గురించి అవగాహన కల్పించాలరు. గ్రామాల్లో ఏవరినీ కులంపేరుతో దూషిస్తే చర్యలు తప్పవన్నారు. కుల వివక్షకు గురైనవారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజయ్య, మాజీ సర్పంచ్ లత, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర సందడి

- ఆనందంతో యువత సంబురాలు
- శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజలు

హ్యాపీ.. న్యూ ఇయర్ అంటూ 2025 సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. డిసెంబరు 31ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబురాలు జరుపుకొన్నారు. యువత కేరింతలు కొడుతూ రోడ్లపై తిరుగుతూ సంతోషంతో వేడుకలు నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ముందస్తుగా వేడుకలు చేశారు. ప్రజలంతా తమ స్నేహితులు, బంధువులు, తెలిసినవారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

2025కు ఘన స్వాగతం



దుబ్బాక: ముస్తాబైన బాలాజీ ఆలయం



సిద్దిపేటలోని ఓ బేకరీలో ప్రజల సందడి



దుబ్బాకలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



హుస్నాబాద్‌లో జోరుగా కేకుల అమ్మకాలు

ఆటో డ్రైవర్లకు ఏసీపీ అవగాహన

సిద్దిపేటకమాన్: ఆటో డ్రైవర్లు ప్రయాణికులపై మర్యాదగా ప్రవర్తించాలని, ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. సిద్దిపేట బస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రయాణికులు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ఆటోలు నడుపుకోవాలని సూచించారు. దుకాణాల ఎదురుగా ఆటోలు నిలిపి గొడవలు పెట్టుకోకూడదని చెప్పారు. ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు, రఘు, హెడ్ కానిస్టేబుల్ సత్యం, కానిస్టేబుళ్లు మహేశ్ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏసీపీ సుమన్‌కుమార్

శిక్షణతో ఉపాధి అవకాశాలు

దుబ్బాక: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఓజేటీ (ఆన్ ది జాబ్ ట్రైనింగ్)ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ కళాశాల వొకేషనల్ విద్యార్థులకు కొనసాగుతున్న శిక్షణను సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలను సందర్శించారు. శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో సేవలపై విద్యార్థులు రెండు నెలలుగా శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల ఇంటర్ పూర్తయిన వెంటనే ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట లెక్చరర్ శివ కుమార్ ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

– సీసీఎస్ ఏసీపీ యాదగిరి

సిద్దిపేటకమాన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని సీసీఎస్ ఏసీపీ యాదగిరి అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ గురించి పోలీసు అధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నారులతో భిక్షాటన చేయించినా, వారిని పనిలో పెట్టుకున్న వ్యక్తులపై నిఘా ఉంచాలని, బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. వెట్టి చాకిరీ చేయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలకార్మికుల గురించి సమాచారం తెలిసినవారు 100కు లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 87126 67100కు తెలపాలని కోరారు.

పోలీసులకు సేవా పథకాలు



రవీందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి 2025 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సేవా పథకాలు ప్రకటించింది. కమిషనరేట్ పరిధిలోని ములుగు పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మన్నె రవీందర్‌రెడ్డి ఉత్తమ సేవా పథకానికి, సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ అహ్మద్ అలీ, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వరరావు సేవా పథకానికి ఎంపికయ్యారు.

25 పైసల నాణేలతో 2025

రూపొందించిన రామరాజు



గజ్వేల్‌రూరల్: 1998 నాటి 1000కు పైగా 25పైసల నాణేలతో 2025 సంవత్సరం చిత్రాన్ని తయారుచేసి శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు అందరినీ అబ్బురపర్చారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఆర్యవైశ్య మహిళకు కుట్టుమిషన్ అందజేత

కోహెడ(హుస్నాబాద్): స్థానిక వేంకటేశ్వరగార్డెన్‌లో ఆర్యవైశ్య మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కాపర్తి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా నీల రవీందర్, సహాయ కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా గుండా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా చంద్రశేఖర్, పీఆర్‌ఓగా నీల వెంకటేశం, సభ్యులుగా సతీశ్, మహేందర్ ఎంపికయ్యారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సముద్రాల హరినాథ్‌గుప్తా పేద కుటుంబానికి చెందిన ఆర్యవైశ్య మహిళకు కుట్టుమిషన్ అందించారు. శ్రీనివాస్, రత్నకర్, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడులు యాదగిరి తెలిపారు. అర్బన్ అధ్యక్షుడు భిక్షపతి, మహేందర్, పరశురాములు, బాబు, కర్ణాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన సత్తని యాదయ్య కొన్ని రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో గాయపడ్డాడు. మంగళవారం ఆర్థిక చేయూత ఫౌండేషన్ సభ్యుడు దుబ్బసి రమేష్ అతడిని పరామర్శించి రూ.8వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట గ్రామస్తులు శనిగరం లక్ష్మణ్, జంగిటి భిక్షపతి, రాజు, బంగారిగల్ల కిరణ్, గోనెపల్లి మహేష్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే పీఆర్టీయూ పోరాటం

దుబ్బాక/వర్గల్(గజ్వేల్)/దౌల్తాబాద్(దుబ్బాక): పీఆర్‌టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌లను మంగళవారం ఆవిష్కరించారు. దుబ్బాకలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మద్దుల లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షులు పల్లె శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంఈఓ ప్రభుదాసు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వేణుగోపాలచారి, రాంచంద్రారెడ్డి, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. వర్గల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నేతలు శశిధర్‌శర్మ, మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్‌గౌడ్, కనకరాజు, కృష్ణసౌజన్య, నాయకులు నర్సింహారెడ్డి, సుభాష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అరవింద తదితరులు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండలం గాజులపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు క్యాలెండర్‌ను ఆవిష్కరించి విద్యార్థులకు బహూకరించారు.

మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

బెజ్జంకి(సిద్దిపేట): దివగంత, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పోచయ్య, చిన్నారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

సిద్దిపేటజోన్: స్థానిక 28వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి మాజీ కౌన్సిలర్ రుక్సార్ వహిద్ ఖాన్ మంగళవారం అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ఇళ్ల స్థలాలు ఇంటి స్థలం అదేవిధంగా ప్రభుత్వ రుణసాయం గురించి వివరించారు. ఈ సందర్భంగా 20రోజులగా వార్డులో సర్వేలో పాల్గొని విజయవంతం చేసిన మున్సిపల్ సిబ్బందికి ఆమె సన్మానం చేశారు.

నేడు ముత్యంరెడ్డి విగ్రహావిష్కరణ

తొగుట(దుబ్బాక): మండలంలోని బండారుపల్లి మెట్టు వద్ద దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1గంటకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతారావు చేతుల మీదుగా విగ్రహావిష్కరణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు.